

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కరీంనగర్
గురువారం | నవంబర్ 30, 2023 | www.navatelangana.com



ఓటింగ్‌కు వేళాయె..

13నియోజకవర్గాలు.. 3617 పోలింగ్ బూత్‌లు..

- బరిలో 216మంది అభ్యర్థులు.. ప్రధాన పార్టీల మధ్యే పోటీ!
- నేడు ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఓటింగ్
- ఈవీఎం సహా ఎన్నికల సామాగ్రితో తరలివెళ్లిన పోలింగ్ సిబ్బంది
- నిర్వహణపై దృష్టిసారించేందుకు వెబ్‌క్యాస్టింగ్, వీడియోచిత్రీకరణ
- పోలింగ్ కేంద్రానికి 100మీటర్ల వరకు 144సెక్షన్ అమలు
- ఖాకీ నిఘాలో పోలింగ్ కేంద్రాలు.. సమస్యాత్మక ప్రాంతాల్లో పటిష్ట బందోబస్తు
- డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు.. తేలనున్న అభ్యర్థుల భవితవ్యం

సార్వత్రిక అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గురువారం జరగనున్న పోలింగ్ ప్రక్రియకు ఉమ్మడి జిల్లాలోని 13నియోజకవర్గాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. 29లక్షలా 38వేలా 424 మంది ఓటర్లు ఉన్న ఈ 13 సెగ్మెంట్లలో 3వేలా 617 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు అయ్యాయి. ప్రధాన పార్టీల అభ్యర్థుల నడుమే పోటీ నెలకొనగా.. బరిలో మాత్రం 216 మంది నిలిచారు. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటలవరకు పోలింగ్ ప్రక్రియ సాగనుంది. సమస్యాత్మక ప్రాంతాల్లో సాయంత్రం 4గంటలవరకే పోలింగ్‌కు గడువు విధించారు. ఇప్పటికే ఈవీఎంలు సహా ఎన్నికల సామాగ్రితో ఆయా కేంద్రాలకు సిబ్బంది చేరుకున్నారు. ఈసారి వెబ్‌క్యాస్టింగ్, వీడియో చిత్రీకరణ సహా పర్యవేక్షణకు అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసిన కేంద్ర ఎన్నికల సంఘం ఆయా కేంద్రాలన్నింటినీ ఖాకీల నిఘాలో ఉంచింది. కేంద్రానికి 100మీటర్ల దూరంలో 144సెక్షన్ విధించింది. ప్రధానంగా రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలో 50సున్నితమైన ప్రాంతాలుగా గుర్తించగా.. మంథని తూర్పుడివిజన్‌పై ప్రత్యేక దృష్టిసారించారు. ఏదేమైనా నేడు జరగబోయే పోలింగ్ నేపథ్యంలో అభ్యర్థుల భవితవ్యం ఈవీఎం మిషన్లలో నిక్షిప్తం కానుంది.

- నవతెలంగాణ, కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి/ సిరిసిల్ల/జగిత్యాల/ పెద్దపల్లి

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్, మానకొండూర్, హుజూరాబాద్, చొప్పదండి, హుస్నాబాద్, సిరిసిల్ల, వేములవాడ, జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి, పెద్దపల్లి, మంథని, రామగుండం నియోజకవర్గాల్లో గురువారం నిర్వహించబోయే పోలింగ్‌కు అవసరమైన అన్ని ఏర్పాట్లను ఆయా జిల్లాల అధికారులు పూర్తి చేశారు. ప్రధానంగా ఆయా కేంద్రాల్లో ర్యాంప్, ఫర్నిచర్, లైటింగ్, టాయిలెట్స్ ఇలా అన్ని సౌకర్యాలూ ఏర్పాటు చేశారు. ప్రిసైడింగ్ ఆఫీసర్లు, ఇతర పోలింగ్ అధికారులు, సెక్టార్, ఫ్లయింగ్, స్టాటిక్, వీడియో నిఘా టీమ్‌లు, వీడియోలను నిశితంగా పరిశీలించే బృందం, వ్యయ పరశీలకులు, వ్యయ పర్యవేక్షణ బృందం, మైక్రో పరిశీలకులు, రూట్, నోడల్ ఆఫీసర్లు, బూత్‌లెవల్ ఆఫీసర్లు ఇలా అన్ని విభాగాలకు సంబంధించిన సిబ్బందిని ఇప్పటికే నియమించారు. అన్ని జిల్లాల్లో 98శాతం మేర ఓటర్‌స్లిప్‌లను పంపిణీ చేశారు. ప్రత్యేకంగా ఈ ఎన్నికలకు సంబంధించి కమ్యూనికేషన్ రూమ్‌తో పాటు

▶ మిగతా 2లో...

ఓటరు మహాశయా
మేలుకో..

సినిమా టికెట్ కోసం ఎంత సమయమైనా వరసలో నిలబడతాం. తీరా మన భవిష్యత్తును బాగు చేసుకునే ఓటు వేసే రోజున మాత్రం తీరిక లేదనే నిర్లిప్తతతను చూపిస్తాం. ఓటుకు దూరంగా ఉంటాం. ఒకసారి ఆలోచించండి.. అరకొర పోలింగ్ తీరుతెన్నులను మార్చేద్దాం. ఓటు దిశగా బాధ్యతతో అడుగు వేద్దాం... మన వంతు భాగస్వామ్యాన్ని చూపిద్దాం.. మన తలరాతను మార్చే బ్రహ్మాస్త్రం ఓటు రూపంలోనే మన చేతుల్లోనే ఉందనే గుర్తిద్దాం. ఓటు అనే రెండక్షరాలే ప్రజల తలరాతను మారుస్తాయి. ఓట్లు లక్షల్లో ఉన్నా గెలుపొందే అభ్యర్థుల మధ్య వ్యత్యాసం వేళల్లోనే ఉంటుంది. పౌరుల ఓటు హక్కు వినియోగం పెరిగితే అభ్యర్థుల గెలుపోటముల్లో ప్రతి ఓటు విలువా మరింత విలువైనదిగా మారుతుంది. ప్రజల తలరాతలను మార్చే చట్టాలను తయారు చేసే శక్తి శాసనసభ్యునికి ఉంది. దానికి ప్రాతినిధ్యం వహించే సభ్యులు ప్రజల చేత ఎన్నుకోబడేవారే. తీరిక లేదని 10 నిమిషాల ప్రక్రియను వాయిదా వేస్తే పౌరుడిగా మన బాధ్యతను విస్మరించినట్లే. అందుకే ఓటరు ఓటు దిశగా అడుగేయ్..విలువైన ఓటును సంధించేయ్...!

పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

- ఎద్దపల్లి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్
- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రత
- డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద పోలింగ్ సామాగ్రి పంపిణీ



4లో...

యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే రోడ్డు ప్రమాదంలో కార్మికుడి మృతి

5లో...

- జీడీకే11వ ఇంక్లైన్ పాత రోడ్డును పునఃరుద్ధరించాలి
- గనిని బంద్ చేసి నిరసన వ్యక్తం చేసిన కార్మికులు
- మద్దతుగా ఏఐటీయూసీతో పాటు ఇతర కార్మిక సంఘాలు



పోలింగ్‌కు వేళాయే...

(మొదటి పేజీ తరువాయి)

మీడియా మానిటరింగ్, వెబ్ కాస్టింగ్ విధానంతో పోలింగ్ ప్రక్రియను ఆయా జిల్లాల కలెక్టరేట్ల నుంచి నిరంతరం పర్యవేక్షించనున్నారు. ప్రధానంగా పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల దూరంలో 144 సెక్షన్ అమలు చేయనున్నారు.

సిరిసిల్ల జిల్లాలో...

సిరిసిల్ల జిల్లాలో 4లక్షలా 66వేలా 677 మంది ఓటర్లు ఉండగా.. ఇందులో మహిళలు 2లక్షలా 22వేలా 815 మంది, పురుషులు 2లక్షలా 26వేలా 553 మంది ఉన్నారు. ట్రాన్స్‌జెండర్లు 37 మంది ఉన్నారు. ఈ జిల్లాలో మొత్తం 560 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా పట్టణ ప్రాంతాల్లో 123, గ్రామీణ ప్రాంతాల్లో 437 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ పోలింగ్ కేంద్రాలకు 1700మందికిపైగా పోలింగ్ సిబ్బంది తరలివెళ్లారు. జిల్లాలో 100 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించారు.

జగిత్యాల జిల్లాలో...

ఈ జిల్లాలోని జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల మూడు నియోజకవర్గాల్లోని 78రూట్లలో మొత్తం 785 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 234 మంది మైక్రో అబ్జర్వర్లతో పాటుగా నిరంతర పర్యవేక్షణ కోసం 992 సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ జిల్లాలో 161 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. 10కంపెనీల కేంద్ర బలగాలు కలుపుకుని 3వేల మందిపోలీసులు రంగంలోకి దిగారు. జగిత్యాల జిల్లాలో హోంఓటింగ్ విధానంలో 1141మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల సందర్భంగా జిల్లాలో రూ.2కోట్లా 59లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు.

కరీంనగర్ జిల్లాలో ....

కరీంనగర్ జిల్లాలో 1338 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో 289 సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. 900 మంది పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్‌ను, క్రిటికల్ పోలింగ్ కేంద్రాలలో మైక్రో అబ్జర్వర్లను నియమించారు. ఈ ఎన్నికల సందర్భంగా జిల్లాలో 25వేల మంది కొత్త ఓటర్లు నమోదు అయ్యారు. ఆయా కాలేజీల్లో నిర్వహించిన స్వీప్ కార్యక్రమాల ద్వారా 5507 మంది యువత ఓటు హక్కు పొందారు. హోం ఓటింగ్ విధానం ద్వారా 12డీ ఫారాలతో 1195 మంది వికలాంగులు, వృద్ధులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక పోస్టల్ బ్యాలెట్ ద్వారా జిల్లాలో 5700 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

పెద్దపల్లి జిల్లాలో...

పెద్దపల్లి జిల్లాలో నియోజకవర్గాల వారీగా రామగుండంలో 260, మంథనిలో 288, పెద్దపల్లిలో 290 కలుపుకని మొత్తం 838 పోలింగ్ కేంద్రాలనుఏర్పాటు చేశారు. ఇందులో 110 సమస్యాత్మక కేంద్రాలనుగుర్తించారు. ఈ ఎన్నికల నిర్వహణ బందోబస్తుకుగాను 3, 352 మంది పోలీసులను నియమించారు. ఈ జిల్లాలో 7,11,727 మంది ఓటర్లు ఉండగా.. ఇందులో 3,53,953 మంది పురుషులు, 3,57,722 మంది మహిళలు ఉన్నారు.

నోట్లు 'కట్టలు' తెంచుకున్నాయ్...

మంగళవారంతో ప్రచారానికి బ్రేక్ పడగా.. బుధవారం ఆయా నియోజకవర్గాల్లో నోట్ల కట్టలు తెంచుకున్నాయి. ఒక్కో నియోజకవర్గంలో ఓటుకు రూ.వెయ్యి నుంచి రూ.2వేల వరకు పంపిణీ చేశారు. అయితే ఇందుతో ద్వితీయశ్రేణి నాయకులు, కార్యకర్తలు చేతివాటం ప్రదర్శించారు. తమకు అప్పగించిన బూత్‌లెవల్లో అప్పగించిన ఓటర్లలో కొంతమందికే డబ్బులు పంచి మిగతా జేబుల్లో వేసుకున్నారు.కొన్ని చోట్ల ఓటుకు రూ.వెయ్యి పంచమని చెబితే రూ.500వరకే ఇచ్చారు. మానకొండూర్ నియోజకవర్గంలో అధికారపార్టీ నుంచి రూ.500 వస్తే ప్రతిపక్ష పార్టీల వాళ్లు రూ.300 నుంచి రూ.500 పంచారు. 'ప్రచారానికి వస్తేనే రూ.500 ఇచ్చారు.. ఓటేసేందుకు ముష్టి మూడు వందలు ఇస్తారా?' అంటూ తిమ్మాపూర్ మండలంలో కొందరు మహిళలు తిరగబడ్డారు. దీంతో అక్కడి నుంచి సదరు నాయకులు మెల్లిగా జారుకున్నారు. మరికొన్ని చోట్ల డబ్బులు రాలేదంటూ గుస్సగా ఉండగా.. వచ్చిన ఓటర్లు మాత్రం కిమ్మనకుండా ఉండిపోయారు.

పోలింగ్‌స్టేషన్ వివరాలు పొందండి ఇలా..

'మీ దగ్గర ఓటరు గుర్తింపు కార్డు ఉంటే ఆ కార్డు నెంబర్‌ను 1950, 92117 28082 నంబర్లకు ఎస్ఎమ్ఎస్ చేస్తే పోలింగ్ కేంద్రం వివరాలు తిరిగి వస్తాయి.' 24 గంటల పాటూ పనిచేసే టోల్‌ఫ్రీ నెంబరు 1950కు ఫోన్ చేసి కూడా వివరాలు తెలుసుకోవచ్చు. ఓటరు గుర్తింపు కార్డునెంబర్ సాయంతో పోలింగ్ కేంద్రం, బూత్ నంబరు, క్రమ సంఖ్య వంటి వివరాలు తెలుసుకోవచ్చు. ఎన్నికల సంఘానికి చెందిన 'ఓటరు హెల్ప్‌లైన్' యాప్ డౌన్‌లోడ్ చేసుకుని కూడా వివరాలు పొందొచ్చు. ఎన్నికల సంఘం వెబ్‌సైట్ www.ceotelangana.nic.in లేదా www.electoralsearch.eci.gov.in ద్వారా పోలింగ్ కేంద్రం వివరాలు తెలుసుకోవచ్చు. www.ceotelangana.nic.in లోని Ask Voter Sahaya Mithra చాట్‌బాట్ ద్వారా కూడా వివరాలు తెలుసుకోవచ్చు.



ఓటు వేసేందుకు ఏమేం తీసుకెళ్లాలి?

ఫొటో ఓటరు స్లిప్పు, ఫొటో గుర్తింపు కార్డు (ఎపిక్), ఆధార్ కార్డు, పాసుపోర్టు, డ్రైవింగ్ లైసెన్సు, కేంద్ర, రాష్ట్ర, పబ్లిక్ సెక్టార్, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగుల ఫొటో గుర్తింపు కార్డు, బ్యాంకులు, పోస్టాఫీసు జారీ చేసిన పాసుపుస్తకం (ఫొటోతో ఉన్నవి), పాన్‌కార్డు, జనగణన ఆధారంగా జారీ చేసిన స్మార్ట్‌కార్డు, ఎంఎస్‌ఆర్ఈజీఏ జారీ చేసిన జాబ్‌కార్డు, కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఆరోగ్య బీమా స్మార్ట్‌కార్డు, ఫొటోతో జత చేసిన పింఛను పత్రాలు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు జారీ చేసిన అధికార గుర్తింపు పత్రం వీటిల్లో ఏదైనా గుర్తింపు పత్రంగా చూపించొచ్చు.

పెద్దపల్లిలో రూ.31లక్షలు పట్టివేత

పెద్దపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి చింతకుంట విజయరమణారావు బంధువుల ఇంట్లో మంగళవారం రాత్రి ఎన్నికల అధికారులు తనిఖీలు నిర్వహించారు. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామంలో విజయరమణరావుకు సంబంధించిన కుటుంబసభ్యులు ఆనందరావు ఇంటిపై దాడులు నిర్వహించి రూ.31లక్షల నగదును పట్టుకున్నారు. ఈడబ్బు ఓటర్లకు పంచేందుకు దాచారని ప్రాథమిక నిర్ధారణకు రావడంతో ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. అనంతరం నగదును పెద్దపల్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి తరలించారు.

కరీంనగర్ జిల్లాలో రూ.3.45కోట్ల మద్యం పట్టివేత

గత నెల 9 నుంచి నేటి వరకు కరీంనగర్ జిల్లాలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో 1353 కేసులు నమోదు చేసి 188 మంది నిందితులను అరెస్టు చేశాం. ఈ కేసుల్లో 354లీటర్ల గుడుంబా, 219525 లీటర్ల బెల్లంపానకం ధ్వంసం చేశాం. 2691.58లీటర్ల మద్యం బాటిళ్లను, 2368.81లీటర్ల బీరును సీజ్ చేశాం. మొత్తం విలువ రూ.3.45కోట్లు వరకు ఉంటుంది. ఎన్నికల్లో మద్యం అక్రమతరలించే అవకాశం ఉన్నట్టు అనుమానించిన 413 మందిని తహశీలార్ల ఎదుట బైండోవర్ చేయగా జిల్లాలో ఆరు షాడో టీమ్స్‌లు పని చేస్తున్నాయి.

– పీ.శ్రీనివాసరావు, కరీంనగర్ జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి

కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలు.. కమలాపూర్‌లో కేసు

బీఆర్ఎస్ హుజూరాబాద్ అభ్యర్థి కౌశిక్‌రెడ్డి చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు ఇప్పుడు సంచలనం రేపాయి. దీనిపై స్పందించిన కేంద్ర ఎన్నికల సంఘం విచారణ చేసి నివేదిక ఇవ్వాలని హుజూరాబాద్ ఎన్నికల అధికారులను ఆదేశించింది. 'ఎన్నికల్లో నాకు ఓటు వేసి గెలిపిస్తే జైత్రయాత్ర.. ఓడితే శవయాత్ర.. నేను ఏ యాత్ర చేయాలో మీరే నిర్ణయించుకోండి' అంటూ ఓటర్లను అభ్యర్థించిన విషయం తెలిసిందే. మరోవైపు కౌశిక్ వ్యాఖ్యలపై ఎంపీడీఓ ఫిర్యాదుతో హన్మకొండ జిల్లా కమలాపూర్‌లో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎన్నికల ప్రచార చివరి రోజున హుజూరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి చేసిన భావోద్వేగ వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. మంగళవారం జరిగిన ప్రచారంలో కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ ' ఎన్నికల్లో నాకు ఓటు వేసి గెలిపిస్తే జైత్రయాత్రతో వస్తా.. ఓడితే నా శవయాత్రకు మీరు రావాల్సి ఉంటుంది. నేను ఏ యాత్ర చేయాలో మీరే నిర్ణయించుకోండి'. అంటూ ఓటర్లను అభ్యర్థించారు. ఈ వ్యాఖ్యలు వివాదాస్పందంగా ఉండటంతోపాటు ఓటర్లను ప్రభావితం చేసేలా ఉన్న నేపథ్యంలో ఎన్నికల సంఘం నివేదిక కోరింది. వీలైనంత త్వరగా ఆ విచారణ నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. ఈ క్రమంలో హన్మకొండ జిల్లా కమలాపూర్ మండల పోలీసు స్టేషన్‌లో స్థానిక ఎంపీడీఓ ఫిర్యాదుతో కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదు అయింది. ప్రచారంలో ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించారని, ఓటర్లను ప్రభావితం చేసేలా భావోద్వేగ వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయన వ్యాఖ్యలపై అక్కడి ప్రజలు నివ్వెరపోయారు. మరోవైపు ఈ వ్యవహారంపై కేంద్ర ఎన్నికల సంఘం స్పందించింది.

మాక్ పోలింగ్‌పై విద్యార్థులకు అవగాహన



మాక్ పోలింగ్లో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ – సిరిసిల్ల టౌన్ :

సిరిసిల్ల పట్టణంలోని బడ్స్ అండ్ ఫ్లవర్స్ పాఠశాలలో విద్యార్థులకు మాక్ పోలింగ్ పై అవగహన నిర్వహించారు. భారతదేశంలో జరిగే ఎన్నికల విధి విధానాలు, ఓటర్ లిస్టు ప్రదర్శన, నామినేషన్ స్వీకరణ, నామినేషన్ విత్ డ్రా, ఓటింగ్ మొదలగు వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ రామయ్య శర్మ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రతీ ఒక్కరూ తమ ఓటు హక్కును ఎలాంటి ప్రలోభాలకు లోనవ్వకుండా వినియోగించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కళ్యాణీశర్మ, ఉపాధ్యాయ బందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఎన్నికల పోలింగ్ చేపట్టాలి

- సాధారణ పరిశీలకులు డాక్టర్ జగదీష్ సాన్‌కర్
- ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియను క్షేత్ర స్థాయిలో పరిశీలన

నవతెలంగాణ – సిరిసిల్ల :

ఎన్నికల నిబంధనల మేరకు పారదర్శకంగా ఎన్నికల పోలింగ్ జరిగేలా చూడాల్సిన బాధ్యత పోలింగ్ సిబ్బంది దే నని సాధారణ పరిశీలకులు డాక్టర్ జగదీష్ సాన్ కర్ అన్నారు. బుధవారం సిరిసిల్ల నియోజకవర్గానికి సంబంధించి సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో, వేములవాడ నియోజకవర్గానికి సంబంధించి వేములవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలను సాధారణ పరిశీలకులు డాక్టర్ జగదీష్ సాన్ కర్, ఎన్నికల పోలీస్ పరిశీలకులు వినిత సాహు, ఎన్నికల వ్యయ పరిశీలకులు జి.మణిగండసామి పరిశీలించారు. ఈ సందర్భంగా సాధారణ పరిశీలకులు మాట్లాడుతూ.. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పోలింగ్ ను నిర్వహించాలనీ చెప్పారు. ఉదయం 05.00 గంటలకే మాక్ పోలింగ్ చేపట్టాలన్నారు. ఉదయం 07.00 గంటలకు వాస్తవ పోలింగ్ ప్రారంభించాలని చెప్పారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతాన్ని నివేదించాలన్నారు. ఈవీఎంలకు ఏమైనా సాంకేతిక సమస్యలు ఉత్పన్నమైనా, ఏమైనా సెక్టార్ అధికారులు, రిటర్నింగ్ అధికారులకు నివేదించాలని చెప్పారు. పోలింగ్ ముగిసిన అనంతరం నిబంధన ల మేరకు సీల్ వేసి రిసెప్షన్ కేంద్రాలలో అప్పగించాలనీ చెప్పారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారులు ఆనంద్ కుమార్, మధు సూదన్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రం ను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారులు

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణే మనందరి లక్ష్యం

- ఎన్నికల ప్రశాంత నిర్వహణకు 1700పైగా సిబ్బందితో భద్రతా ఏర్పాట్లు
- క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు భద్రతకు ప్రత్యేక చర్యలు



ఈవీఎం కేంద్రం వద్ద పోలీసులకు సలహాలు సూచనలు ఇస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

నవతెలంగాణ - సిరిసిల్ల/ వేములవాడ :

తెలంగాణ అసెంబ్లీ -2023 ఈ నెల 30 వ తేదీ గురువారం రోజున జరుగు ఎన్నికల సందర్భంగా పటిష్ఠ నిర్వహణ కోసం భద్రతా ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని,ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణే మనందరి లక్ష్యం అని ఎస్పీ అఖిల్ మహాజన్ అధికారులకు, సిబ్బందికి సూచించారు. వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌తోపాటు సిరిసిల్ల పట్టణంలోని కాలేజ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు, సిబ్బందికి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి ఎన్నికల రోజు, ఎన్నికల తరువాత పొలీసుల నిర్వహించాల్సిన బందోబస్తు విధులపై ఎస్పీ పోలీస్ అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్నికల వేళ రూట్ బందోబస్తు, పోలింగ్ స్టేషన్ బందోబస్తు, పెట్రోలింగ్ పార్టీ పోలీసులు నిర్వహించాల్సిన విధులను తెలియజేశారు.

భద్రతా ఏర్పాట్లు ఇలా.....

జిల్లాలో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగే విధంగా పటిష్ఠ భద్రత చర్యలు చేపట్టామని, జిల్లాలో ఉన్న 560పోలింగ్ కేంద్రాల్లో సుమారుగా 1700మందికి పైగా భద్రతా విధులలో పాలుపంచుకోనుండగా ఇందులో ఎస్పీ-01,ఆదనపు ఎస్పీ-01,డీఎస్పీ లు- 05, ఇన్స్పెక్టర్‌లు 16, ఎస్ఐలు 34, జిల్లా సిబ్బంది(ఏఎస్ఐ నుంచి హెూమ్ గార్డ్ వరకు సివిల్,ఆర్మ్డ్ సిబ్బంది) - 700, కేంద్ర బలగాలు - 480, బెటాలియన్ సిబ్బంది - 42, ఆర్.పి.ఎఫ్ సిబ్బంది - 52,మహారాష్ట్ర కు చెందిన హెూమ్ గార్డ్స్ 450, ప్రత్యేక బందాలతో కూడిన పోలీస్ సిబ్బంది విధులు నిర్వహిస్తారని ఆయన తెలిపారు. అంతే కాకుండా రూట్ మొబైల్స్ - 53, క్విక్ రియాక్షన్ టీమ్స్ -13, స్ట్రయికింగ్ ఫోర్స్-13 మరియు స్పెషల్ స్ట్రయికింగ్ టీమ్స్ 02 ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

పోలింగ్ స్టేషన్ల వద్ద విధులు నిర్వహించే అధికారులకు సిబ్బందికి ఎస్పీ సూచనలు..

- పోలింగ్ స్టేషన్లో ఈవీఎంల భద్రత, ఎన్నికల సామాగ్రి భద్రతా, పోలింగ్ పూర్తయిన తర్వాత తిరిగి పంపే అంతవరకు అప్రమత్తంగా ఉండాలి. ఆదేశాలు వచ్చేవరకు పోలింగ్ కేంద్రం నుంచి బయటకు వెళ్లరాదు.
- ఉదయం 6గంటలకు మార్క్ పోలింగ్ ఉన్నందున అధికారులు సిబ్బంది ఆరు గంటలలోపు యూనిఫాంలో విధులు నిర్వహించడానికి సిద్ధంగా ఉండాలి.
- పోలింగ్ స్టేషన్ వద్ద విధులు నిర్వహించే వారు ప్రిసిడింగ్ అధికారి అనుమతి లేనిది పోలింగ్ కేంద్రంలోనికి వెళ్లరాదు. అత్యవసర సమయంలో ప్రిసిడింగ్ అధికారి ఆదేశాల మేరకు మాత్రమే పోలింగ్ కేంద్రంలోకి వెళ్లాలి.
- ఓటు హక్కు వినియోగించుకున్న తర్వాత ఓటు వేసిన వారిని కేంద్రం నుండి బయటకు పంపించాలి.
- పోలింగ్ కేంద్రానికి చేరుకోగానే పోలింగ్ కేంద్రం చుట్టూ పరిశీలించాలి, మరియు 100 మీటర్స్, 200 మీటర్ లైనింగ్ వేయించాలని సూచించారు.
- ఓటు హక్కు వినియోగించుకోవడానికి వచ్చే ఓటర్లను, క్యూ పద్ధతిలో పోలింగ్ కేంద్రంలో నికి పంపించాలి.
- పోలింగ్ కేంద్రంలో కి ఓటు హక్కు వినియోగించుకోవడానికి వచ్చే ఓటర్లు, పోలింగ్ ఏజెంట్లు వద్ద అగ్గిపెట్టెలు, నీళ్ల బాటిళ్లు, సెల్ ఫోన్లు, మరే ఇతర వస్తువులు ఉండకుండా జాగ్రత్త తీసుకోవాలి.
- ముఖ్యంగా వికలాంగులు, వద్ధులు, గర్భిణీ స్త్రీలు, చంటి పిల్లల తల్లులు, ఓట్లు వేయడానికి వచ్చే సమయంలో వీలైనంత త్వరగా ఓటు వేయించి బయటకు పంపించేలా చూడాలి.
- పోలింగ్ కేంద్రంలో ఏదైనా సంఘటన జరిగే అవకాశం ఉంటే వెంటనే మొబైల్ పార్టీకి సమాచారం అందించాలని సూచించారు.

ఏరూట్ మొబైల్ పార్టీ విధులు...

- రూట్ మొబైల్ పార్టీలు ఈవీఎంలకు ఎస్కార్ట్‌గా ఉండి పంపిణీ కేంద్రం నుంచి పోలింగ్ స్టేషన్‌కు చేర్చి, తిరిగి పోలింగ్ పూర్తయిన తర్వాత తీసుకొని ఎస్కార్ట్‌గా వచ్చి డిస్ట్రిబ్యూషన్ సెంటర్లో అప్పగించే అంతవరకు అప్రమత్తంగా ఉండాలని, ఈవీఎంల భద్రత మనపై ఉందన్నారు.
- పోలింగ్ కేంద్రాలను కలుపుతూ ఉన్న రూట్లలో పోలింగ్ కేంద్రం సమీపంలో ఎవరు కూడా గుంపులు గుంపులుగా ఉండకుండా చూడాలి.
- పోలింగ్ స్టేషన్ చుట్టుపక్కల 100 గజాల వరకు ఏ రాజకీయ పార్టీకి సంబంధించిన టేబుల్స్ వేయడానికి వీలులేకుండా చూడాలన్నారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన బ్యానర్లు పోస్టర్లు పోలింగ్ కేంద్రం వద్ద లేకుండా చూడాలి.
- ఓటర్లను ప్రైవేట్ వాహనాలు ఆటోలు, జీపులు, కార్లలో, తీసుకురాకుండా చూడాలి.
- ప్రతి ఒక్క అధికారి, సిబ్బంది నిష్పక్షపాతంగా విధులు నిర్వహించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలన్నారు.

ఎస్పీ వెంట అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ నాగేంద్రచరి, సి.ఐ లు కరుణాకర్, కష్ణకుమార్,కిరణ్ కుమార్, ఎస్.ఐ లు సిబ్బంది ఉన్నారు.

ప్రతి ఓటరు ఓటు హక్కును వినియోగించుకోవాలి

జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

నవతెలంగాణ - సిరిసిల్ల :

కులం, మతం, జాతి, ప్రాంతం వంటి ప్రలోభాలకు గురవ్వకుండా స్వచ్ఛందంగా ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పిలుపునిచ్చారు. ఓటు హక్కు కలిగిన ప్రతిఒక్కరూ ఈ నెల 30 వ తేదీన అసెంబ్లీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు చాలా ప్రాముఖ్యత కలిగినదన్నారు. అర్హులైన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలన్నారు. ఓటు పాముఖ్యతను గుర్తించి అర్హులైన అందరూ ఎన్నికల్లో ఓటు వేసేలా చైతన్యపర్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. నవంబర్ 30వ తేదీన ఎన్నికల సెలవు ఇంట్లో ఉండేందుకు కాదని, బయటకు వచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకని సూచించారు.

పోలింగ్ కేంద్రాలకు ఈవీఎం పరికరాల తరలింపు



నవతెలంగాణ-గోదావరిఖని:

రామగుండం నియోజకవర్గ పరిధిలో రిటర్నింగ్ అధికారి అరుణశ్రీ ఆధ్వర్యంలో సెక్టర్ అధికారులకు వారి వారి కేటాయించిన ఈవీఎం పరికరాలను పోలింగ్ కేంద్రాలకు తరలించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి అరుణశ్రీ మాట్లాడుతూ.. గుర్తింపు పొందిన వాహనాలలో, కేటాయించిన భద్రత బలగాలతో పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సామాగ్రి తరలించే ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాలల్లో మౌలిక వసతులు, తాగునీరు, దివ్యాంగుల సౌకర్యార్థం వీల్ చైర్, రాంప్, విద్యుత్, నీటి సౌకర్యం, వెబ్ కాస్టింగ్, తదితర ముఖ్యమైన అంశాలపై వివరణ సూచనలు చేశారు. పిఓ, ఏపిఓ, ఓపిఓలను విధులను వివరిస్తూ పూర్తి బాధ్యతగా సజావుగా పోలింగ్ ముగించాలని చేశారు. ఈవీఎం పరికరాల నందు సాంకేతిక లోపాలు, ఇతర అసాంఘిక కార్యక్రమాలు పోలింగ్ కేంద్ర పరిసరాల్లో తలెత్తినచో తక్షణమే సంబంధిత సెక్టర్ అధికారులకు, భద్రత బలగాలకు సమాచారం అందించాలని తెలిపారు. ఈసీఐఎల్ ఇంజనీర్లు, మాస్టర్ ట్రైనర్స్ సమక్షంలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ సెంటర్ నందు టేబుల్ ఇన్‌చార్జిలతో ఈవీఎం పరికరాలు, పోలింగ్ సామాగ్రిని అప్పగిస్తూ వాటిని అమర్చుటకు సరి చూసుకునుటాకు తగిన సూచనలను జాగ్రత్తగా వివరించారు. ఈ సమావేశంలో ఈవీఎం పరికరాల నోడల్ అధికారి రామ్మోహన్ రావు, శిక్షణ విభాగం నోడల్ అధికారి సంపత్‌రావు, ఈసీఐఎల్ ఇంజనీర్లు, మాస్టర్ ట్రైనర్స్, ఏఆర్ఓ కుమారస్వామి, మీడియాని కమ్యూనికేషన్ ప్లాన్ నోడల్ అధికారి రజిని, ఏసీపీ తుల శ్రీనివాసరావు, సిఐలు ప్రమోద్ రావు, చంద్రశేఖర్ గౌడ్, వేణుగోపాల్, సెక్టర్ అధికారులు, పీవో, ఏపీవో, ఓపీవోలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ నేరాల్లో 219మంది బైండోవర్..230 కేసులు

- ఎక్సైజ్ సీఐ చంద్రశేఖర్



మాట్లాడుతున్న ఎక్సైజ్ సిఐ చంద్రశేఖర్

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట :

అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఎక్సైజ్ శాఖ ఎల్లారెడ్డిపేట పరిధిలోని ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, కోనరావుపేట, ముస్తాబాద్, వీర్నపల్లి మండలాల్లో ఎక్సైజ్ నేరాలపై గట్టి నిఘా ఉంచినట్లు ఇప్పటివరకు 219 మందిని బైండోవర్‌లు చేసి, 230 కేసులు నమోదు చేశామని బుధవారం ఎక్సైజ్ సిఐ ఎంపిఆర్ చంద్రశేఖర్ తెలిపారు. నాటుసారాయి తయారు, రవాణా, సేవించే ప్రాంతాలను గుర్తించి వాటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, నాటుసారాయి తయారీదారులను, నాటుసారాయికి ఉపయోగించే ముడి పదార్థాలైన బెల్లం, పటిక అమ్మేవారిని, అనుమానస్పద వ్యక్తులను గుర్తించి సంబంధిత తహశీల్దార్‌ల ముందు బైండోవర్లు చేశామన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి మద్యం తేచ్చే వారిపై కఠినంగా వ్యవరించామన్నారు. వాహనాల తనిఖీలు ముమ్మరంగా చేశామన్నారు. టాస్క్‌ఫోర్స్, ఎన్ఫోర్స్మెంట్ సహకారంతో దాడులు నిర్వహించడం జరిగిందన్నారు. ఎన్నికల షెడ్యూలు వచ్చిన నుంచి ఇప్పటి వరకు 230 కేసులు నమోదు చేసి, 59269 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి, 73 లీటర్ల నాటుసారాయి, 198 లీటర్ల మద్యం, 231 లీటర్ల బీర్లు స్వాధీనం చేసుకన్నామని, బెల్లం 277 కిలోలు, 2 ఆటోలు, 5 బైక్‌లు పట్టుకున్నమన్నారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఇప్పటి వరకు సంబంధిత తహశీల్దార్‌ల ముందు 219 మందిని బైండోవర్ చేశామని ఎక్సైజ్ సిఐ ఎంపిఆర్ చంద్రశేఖర్ తెలిపారు.

జీడీకే 11వ ఇంక్లయిన్ పాత రోడ్ పునర్ ప్రారంభించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న సిఐటియు నాయకులు

నవతెలంగాణ-గోదావరిఖని:

జీడీకే 11వ ఇంక్లైన్ కార్మికులు తరచూ ప్రమాదాలకు నిలయంగా మారిన కొత్త రోడ్డు స్థానంలో పాత రోడ్డు పునర్ ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున ఆందోళన జరిగింది. జీడీకే ఓసీపీ5, ప్రారంభంతో పాత రోడ్డు స్థానంలో కొత్త రోడ్డు దాదాపు 15 కిలోమీటర్లు వేయడం జరిగింది. ఈ కొత్త రోడ్డు కార్మికులకు ఏ రకంగాను అనుకూలంగా లేదని, గత ప్రారంభం నుంచి సీఐటీయూ కార్మికులు ఆందోళన చేసినప్పటికీ పాత రోడ్డు పునర్ ప్రారంభించకపోవడంతో కొత్త రోడ్‌తో దాదాపు చాలామంది కార్మికులు ప్రమాదాలకు గురై చనిపోయిన సందర్భాలు ఉన్నాయన్నారు. పెద్ద ఎత్తు సీఐటీయూ జీడీకే 1, 3వ ఇంక్లయిన్ జంక్షన్ వద్ద రాస్తారోకో చేయడం జరిగిందని, అయినప్పటికీ మేనేజ్మెంట్ పెడచెవిన పెట్టి అదే మార్గంలో కార్మికులు, ప్రయాణికులు మంథని, భూపాలపల్లికి వెళ్లే బస్సులు, లారీ బొగ్గు ట్రాన్స్‌ఫోర్ట్, నిత్యం రద్దీగా మారడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని సీఐటీయూ అనుబంధ సింగరేణి కాలరీస్ ఎంప్లాయిూస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి తెలిపారు. కొత్త రోడ్డు మొత్తం కూడా మూలమలుపులు, స్పీడ్ బ్రేకర్లు ఉండడం, బొగ్గు లారీ ట్రాన్స్పోర్ట్ పెద్దపెద్ద లోడ్లు ఎలాంటి పైకప్పు కవరేజ్, లేకుండా లారీలు రావడం వల్ల బొగ్గు పేల్లలు కార్మికుల మీద పడి ప్రమాదాలు జరుగుతున్నాయని, బుధవారం కే.సంపత్ అనే కార్మికుడు ప్రమాదంలో మరణించడానికి కారణం కూడా బొగ్గు పేల్ల లారీపై నుండి పడి వెంటనే లారీ కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందదం జరిగిందన్నారు. దీంతో పెద్ద ఎత్తున కార్మికులు ఆగ్రహానికి గురై ఆందోళన నిర్వహించడంతో సీఐటీయూ కార్మిక సంఘాలన్నీ కూడా అక్కడికి చేరుకొని పాత రోడ్డును పరిశీలించడం జరిగిందని, అయినప్పటికీ మేనేజ్మెంట్ కార్మిక ప్రాణాలను లెక్కలోకి తీసుకోకుండా కొత్త రోడ్నే కొనసాగిస్తామని చెప్పడంతో మెరుపు సమ్మె జరుగుతుందని, దీనికి పూర్తి బాధ్యత సింగరేణి యాజమాన్యమే వహించాలని ఉంటుందని, సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూగా విజ్ఞప్తి చేస్తా ఉన్నామని, కార్మికుల ప్రాణాలను రక్షణ లేనటువంటి ఈ కొత్త రోడ్డు మార్గాన్ని తక్షణమే రద్దుచేసి పాత రోడ్డు మార్గాన్ని ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
4
జగిత్యాల - పెద్దపల్లి
గురువారం 30 నవంబర్ 2023 www.navatelangana.com

పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్
- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రత
- డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద పోలింగ్ సామాగ్రి పంపిణీ



పోలింగ్, కౌంటింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ముజామిల్ ఖాన్

నవతెలంగాణ-మంథని

పెద్దపల్లి జిల్లాల్లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌ను ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని ఏర్పాట్లు చేసినట్టు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం రామగుండం అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేష్ సింగ్ రానా, మంథని,పెద్దపల్లి ఎన్నికల సాధారణ పరిశీలకులు సీ.ఎస్ శ్రీధరలతో కలిసి రామగుండంలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంతో పాటు, మంథనిలోని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలలో పోలింగ్ సిబ్బందికి పోలింగ్ సామాగ్రి పంపిణీ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, ర్యాండ మైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన ఈవీఎం యంత్రాలను సదరు పోలింగ్ కేంద్రాల సిబ్బందికి అప్పజెప్పాలని, రిజర్వ్ ఈవీఎం యంత్రాలు, రిజర్వుపోలింగ్ సామాగ్రి సెక్టార్ అధికారుల వద్ద భద్రంగా ఉండాలన్నారు. సెక్టార్ అధికారులు, పోలింగ్ సిబ్బంది ఎన్నికల నియమ, నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని కలెక్టర్ తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో ఉన్న 3 అసెంబ్లీ నియో జకవర్గాల పరిధిలో మొత్తం 838 పోలింగ్ కేంద్రాలలో 7 లక్షలకు పైగా ఓటర్లు ప్రశాంత వాతా వరణంలో తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవస రమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. జిల్లాలో ఉన్న ఓటర్లందరూ తప్పని సరిగా ఈనెల 30న జరిగే పోలింగ్‌లో పాల్గొని ఓటు హక్కు వినియో గించు కోవాలన్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లకు అవసరమైన తాగునీటి,టాయిలెట్ ఇతర వస తులు కల్పించామని అన్నారు. దివ్యాంగుల కోసం పోలింగ్ కేంద్రం వద్ద అవసరమైన ర్యాంప్, ట్రై సైకిళ్లు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని,సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలను మోహరించామని తెలిపారు.జిల్లాలో అధిక పోలింగ్ శాతం నమోదయ్యే విధంగా విస్తతంగా ఓటు ప్రాము ఖ్యతపై అవగాహన కార్యక్రమాలను నిర్వ హించా మన్నారు. ఈ కార్యక్ర మంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, రామగుండం రిటర్నింగ్ అధికారి జే.అరుణశ్రీ, పెద్దపల్లి రిటర్నింగ్ అధికారి సి.హెచ్. మధుమోహన్, మంథని రిటర్నింగ్ అధికారి హనుమానాయక్, మంథని ఆర్డీవో కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ అధికారి తూము రవీందర్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్ పాల్గొన్నారు.



ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు బందోబస్తు

జగిత్యాల ఎస్పీ సన్ ప్రీత్ సింగ్

నవతెలంగాణ-జగిత్యాల టౌన్

జిల్లాలో స్వేచ్ఛయుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు పోలీస్ అధికారులు, సిబ్బంది కృషి చేయాలని జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. ఎన్నికల విధుల్లో భాగంగా జిల్లాకు వచ్చిన పోలీస్ అధికారులు, సిబ్బందితో జిల్లా కేంద్రంలోని బీఎల్ఎన్ ఫంక్షన్ హాల్‌లో బ్రీఫింగ్ కార్యక్రమం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల విధులకు వచ్చిన సెంట్రల్ ఆర్మ్‌డ్ ఫోర్స్, వివిధ రాష్ట్రాలకు చెందిన పోలీసు అధికారులు, సిబ్బందికి తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రాముఖ్యతను వివరిస్తూ ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాన్ని ఎట్టి పరిస్థితుల లోనూ వదిలి వెళ్లరాదన్నారు. ఓటు హక్కును వినియో గించుకోవడానికి వచ్చిన వారితో మర్యాదపూర్వకంగా ఉండాలని, అనవసర విషయాలు చర్చించవద్దన్నారు. పోలింగ్ జరుగుతున్న సమయంలో పోలింగ్ ప్రశాంత వాతావరణానికి భంగం కలిగే ఏ చిన్న సంఘటన ఎదురైన వెంటనే సంబంధిత అధికారులకు సమా చారం అందించాలన్నారు. ఓటర్లు ఎవ్వరూ కూడా సెల్ ఫోన్‌లు, మందుగుండు సామాగ్రి, ఇంక్ బాటిల్స్, వాటర్ బాటిల్స్, పోలింగ్ బూత్‌లోనికి తీసుకు వెళ్లారాదని, సెల్ఫీలు దిగడం నిషేధం అన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేఖ కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. భారత ఎన్నికల సంఘం నిబంధనలు పాటించాలన్నారు. జిల్లా ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా, శాంతి భద్రతలకు విఘాతం కలిగే పరిస్థితులు ఏర్పడినా నిర్భయంగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. విధులు నిర్వహించే పోలీసులకు ప్రజలు తమవంతు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్మ్‌డ్ రిజర్వ్(ఏఆర్) అదనపు ఎస్పీ ఆర్.జనార్ధన్‌రెడ్డి, డీఎస్పీ వెంకటస్వామి, టౌన్ ఇన్స్పెక్టర్ నటేష్, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



పాల్గొన్న అధికారులు



సన్మానిస్తున్న అధికారులు

ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఇప్పకృష్ణకు సన్మానం

నవతెలంగాణ-గోదావరిఖని:

సింగరేణిలో ఉద్యోగ విరమణ పొందిన ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఇప్ప కృష్ణను స్థానిక జీడీకే -1 సీఎస్‌పీలో ఆయన ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఓడీ దాసరి శ్రీనివాస్, డీవైఎస్ఇ హరీష్, ఫోర్‌మెన్ రాజేందర్, ఓఎస్ వేణు, గుర్తింపు సంఘం ఫిట్ కార్యదర్శి శ్రవన్, జీఎం కమిటీ మెంబర్ పుట్ట రమేష్, హెచ్‌ఓఎం నర్సింహరావు, కార్మికులు, మహిళా కార్మికులు, ఇతర కార్మిక సంఘాల నాయకులు ఉద్యోగ విరమణ పొందిన ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఇప్ప కృష్ణను ఘనంగా సన్మానించారు.

విద్యుద్ఘాతంలో ఒకరు మృతి



పరామర్శిస్తున్న జువ్వాడి కృష్ణారావు

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

విద్యుద్ఘాతంతో ఒకరు మృతి చెందారు. ఈఘటన ఇబ్రహీంపట్నం మండలంలో బుధవారం జరిగింది. మండలంలోని వేములకుర్తి గ్రామానికి చెందిన ఆరే. రాజ్‌కుమార్(48) ఎస్ఐ ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం తన పౌల్ట్రీ ఫారం వద్ద కరెంటు సప్లై కాకపోవడంతో మరమ్మతులు చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కరెంట్ షాకు గురై అక్కడి కక్కడే మృతి చెందాడు. మృతుడికి కొడుకు, కుతురు ఉన్నారు.మృతుడి భార్య లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

మృతుడి కుటుంబానికి నాయకుల పరామర్శ

రాజ్‌కుమార్ కుటుంబాన్ని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు పరామర్శించారు. అనంతరం బిజెపి అభ్యర్థి అర్వింద్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు కుటుంబ సభ్యులను ఓదార్చి శవ యాత్రలో పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలకు తరలిన ఉద్యోగులు

నవతెలంగాణ-కోరుట్ల:కోరుట్ల నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికలు సజావుగా సాగేందుకు అధికారులు అన్ని ఏర్పాటు చేశారు. ఎస్ఎఎస్ పాఠశాల నుంచి ఈవీఎంలను గ్రామాలకు తరలించారు.



గల్ఫ్ కార్మికుడికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న హాండ్స్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు

నవతెలంగాణ-కథలాపూర్

కథలాపూర్ మండల కేంద్రానికి చెందిన గల్ఫ్ కార్మికుడు ధ్యానవేణి శేఖర్ దుబాయ్‌లో పని చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలు విరిగింది. దుబాయ్‌లో హాస్పిటల్ ఖర్చులు భారం అవ్వడంతో ఇండియాకు వచ్చాడు. ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈక్రమంలో మళ్లీ ప్రమాదం జరిగింది. తలకి కుడి కన్ను పైభాగంలో ఉన్న బోన్స్ విరిగిపోయింది. సర్జరీ కోసం దాదాపు రూ.1,50వేల నుంచి 2,00000 వరకు ఖర్చు అవుతుందని డాక్టర్లు తెలిపారు. తెలంగాణ హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ముందుకొచ్చి గాయపడ్డ శేఖర్‌కు రూ.10వేల వైద్య ఖర్చుల కోసం అందించింది. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు తాలూకా మల్లేష్, ఉపాధ్యక్షుడు సామల్ల రంజిత్, సంస్థ సభ్యులు సిరిపురపు రాకేష్ పాల్గొన్నారు.

నేడు వేతనంతో కూడిన సెలవు

నవతెలంగాణ-మంథని

తెలంగాణలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా గురువారం వేతనంతో కూడిన సెలవు ఉంటుందని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ హేమలత బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మంథని నియోజకవర్గంలో వ్యాపార వ్యాణిజ్య సంస్థలో పనిచేసే కార్మికులకు వేతనంతో కూడిన సెలవు ప్రభుత్వ ప్రకటించిందని, నిబంధనలను అతి క్రమించిన వారిపై కఠిన చర్యలు తీసు కుంటామని ఆమె పేర్కొన్నారు. అన్ని రంగాల్లో పని చేసే కార్మికులు స్వచ్ఛందంగా ఎన్నికల్లో పాల్గొని తమ ఓటు హక్కును బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని సూచించారు.

మహిళ అగ్రికల్చరర్ కళాశాల వైస్ ప్రిన్సిపల్‌గా గైని రజిని



నవతెలంగాణ-కోరుట్ల

జగిత్యాల జిల్లా తెలంగాణ సాంఘీక సంక్షేమ మహిళ అగ్రికల్చరర్ వైస్ ప్రిన్సిపల్‌గా గైని రజిని బుధవారం బాధ్యతలు స్వీకరిం చారు. ఆమె ఇంతకు ముందు నిర్మల్ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఇంగ్లీష్ అధ్యాపకురాలిగా పనిచేసి జగిత్యాలకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకో వడమే లక్ష్యమన్నారు.

పోలింగ్ బూత్ అలంకరణ



నవతెలంగాణ-మల్యాల

మల్యాల మండలంలోని ముత్యంపేట గ్రామంలో మాడల్ పోలింగ్ బూత్ ఎన్నికైన సందర్భంగా బూత్‌ను పూలతో ప్రత్యేకంగా అలం కరించారు. మండలంలోని మోడల్ పోలింగ్ బూత్‌గా ముత్యంపేట గ్రామంలో ఎన్నిక కావడంతో గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



పటిష్టమైన ప్రణాళికతో ఎన్నికలు

- ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై 40 కేసులు
- జగిత్యాల ఎస్పీ సన్ ప్రీత్ సింగ్

నవతెలంగాణ-జగిత్యాల

జగిత్యాల జిల్లాలో పటిష్టమైన ప్రణాళికతో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ఇతర శాఖల సమన్వయంతో కలిసి పని చేస్తున్నామని జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ సిబ్బందితో సమీక్షించారు. జిల్లాలోని ప్రతి పౌరుడు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును విని యోగించుకునే వాతావరణం కల్పిస్తున్నామన్నారు. శాంతి యుత వాతవారణంలో ఎన్నికలు నిర్వహించ ుడానికి జిల్లాలో సుమారు 3000 మంది కేంద్ర పోలీస్ బలగాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి మండలానికి ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారితో ప్రత్యేక



మాట్లాడుతున్న ఎస్పీ సన్ ప్రీత్ సింగ్

పెట్రోలింగ్ పార్టీలు, 94 రూట్ మొబైల్స్, 37 క్విక్ రియాక్షన్ టీమ్స్, స్ట్రయికింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రయికింగ్ టీమ్స్, 10 బీఎస్ఎఫ్ కంపెనీల కేంద్ర బలగాలు, మహారాష్ట్ర హోమ్ గార్డ్స్ 800 మంది, ఆర్టీసీ, ఏపీ పోలీసు 160 మంది, సీఐడీ పోలీస్ 46 మంది, పోలింగ్ స్టేషన్‌లో 347 మంది ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్‌లను ఉపయోగిస్తామని చెప్పారు.

జిల్లాలోని పోలింగ్ కేంద్రాల వివరాలు..

జిల్లాలో మొత్తం పోలింగ్ స్టేషన్లు 927, సాధారణ పోలింగ్ స్టేషన్లు 676, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు 251 ఉన్నాయని తెలిపారు. ఇప్పటివరకు స్వాధీనపరచుకున్న నగదు రూ.2,59 ,17,681, లిక్కర్ లీటర్లలో 6709 సుమారుగా అంచనా విలువ రూ. 31,89,467, ఇతర పలు రకాల వస్తువుల సుమారుగా అంచనా విలువ రూ. 1,56,38,048 సీజ్ చేసినట్టు తెలిపారు. లిక్కర్, గోల్డ్, ఇతర వస్తువుల విలువ మొత్తం విలువ రూ. 4,63,03,410

లైసెన్సుడు ఆయుధముల డిపాజిట్..

ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా నియామవళి అనుసారంగా లైసెన్సు కలిగిన ఆయుధములు అన్ని డిపాజిట్ కోసం అండర్ సెక్షన్ 144 సీఆర్‌పీసీ అనుసరించి నిషేధాజ్ఞలు జారీ చేసినట్టు తెలిపారు. జిల్లా సరిహద్దుల్లో ఉన్న 9 చెక్ పోస్టుల్లో 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉండేలా ప్రణాళికతో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

పోలింగ్‌కు పటిష్టమైన బందోబస్తు

రామగుండం సీపీ రెమా రాజేశ్వరీ

నవతెలంగాణ-గోదావరిఖని

రామగుండం కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలో పోలింగ్‌కు పటిష్టమైన బందోబస్తు కల్పించడం జరిగిందని పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరీ అన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలలో ఉన్న 06 డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి సెక్టార్ అధికారులు, పోలీసు రూట్ మొబైల్ అధికారులు, ఆర్మ్డ్ అధికారులతో పోలింగ్ అధికారులను, పోలింగ్ పరికరాలను, పోలింగ్ లొకేషన్‌లకు పటిష్టమైన భద్రతతో తీసుకు వెళ్లడం జరుగుతుందని తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని పోలింగ్ పరికరాల డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను సీపీ సందర్శించారు. పెద్దపల్లి జిల్లా పరిధిలో 1291 మంది అధికారులు, సిబ్బంది, 06 కేంద్ర బలగాల కంపెనీలు, 500 మంది మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన హోం గార్డ్సని, మంచిర్యాల జిల్లాలో 1762 మంది


.ఏర్పాట్లను పరిశీలిస్తున్న రామగుండం సీపీ

అధికారులు, సిబ్బంది, 10 కేంద్ర బలగాల కంపెనీలు, 650 మంది చత్తీస్గఢ్ రాష్ట్రానికి చెందిన హోం గార్డ్స్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వచ్చిన ఒక పోలీస్ టీమ్లను పోలింగ్ బందోబస్త్‌కు వినయోగించడం జరుగుతుందని అన్నారు. పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతమైన వాతావరణం ఎన్నికల నిర్వహణకు మానిటరింగ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 16 కేంద్ర బలగాల సిబ్బందికి ఛత్తీస్గడ్, మధ్యప్రదేశ్, జార్ఖండ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వచ్చిన పోలీసులతో జూమ్ మీటింగ్ నిర్వహించి పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజు వారి బాధ్యతలు, డ్యూటీలపై బ్రీఫింగ్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో 48 గంటల పాటు సైలెన్స్ పిరియడ్‌లో అన్ని లాడ్జిలు, ఫంక్షన్ హల్‌లో, గెస్ట్ హౌస్‌లను చెక్ చేసి ఇక్కడ ఓటు హక్కు లేకుండా బయట నుంచి వచ్చిన వ్యక్తులను బయటకు పంపడం జరిగిందన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా ఎన్నికలు నిర్వహించేందుకు 144 సెక్షన్ అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. మంచిర్యాల జిల్లా పరిధిలో -1989 వ్యక్తులను బైండొవర్ చేసినట్లు, పెద్దపల్లి జిల్లాలో 2231 వ్యక్తుల బైండొవర్ చేయడం జరిగిందని తెలిపారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంత పోలింగ్ లోకేషన్లలో ప్రత్యేక భద్రత ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు.

యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే రోడ్డు ప్రమాదంలో కార్మికుడి మృతి

- జీడీకే11వ ఇంక్లైన్ పాత రోడ్డును పునఃరుద్ధరించాలి
- గనిని బంద్ చేసి నిరసన వ్యక్తం చేసిన కార్మికులు
- మద్ధతుగా ఏఐటీయూసీతో పాటు ఇతర కార్మిక సంఘాలు

నవతెలంగాణ-గోదావరిఖని:

సింగరేణి ఆర్జీ వన్ ఏరియాలోని జీడీకే 11 ఇంక్లయిన్‌కు మంగళవారం రాత్రి విధులు నిర్వహించడానికి వెళుతున్న సర్ఫేస్ పంపు ఆపరేటర్ కొటం సంపత్ అనే కార్మికుడిని జీడీకే 2ఏ మోరీ వద్ద లారీ ఢీ కొన్నడంతో మృతి చెందాడు. విషయం


నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

తెలుసుకున్న జీడీకే-11 ఇంక్లయిన్ కార్మికులు బుధవారం ఉదయం 7 గంటల నుంచి గనిపై యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ఇట్టి రోడ్డు ప్రమాదం జరిగిందని, దీనిని నిరసిస్తూ గనిపై మొదటి షిఫ్ట్ కార్మికులు డ్యూటీలకు వెళ్ళకుండా ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య పాల్గొని వారి ఆందోళనకు మద్దతు తెలుపుతూ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే కార్మికుడి మృతి చెందారని మండిపడ్డారు. గత సంవత్సరం ఈ గనికి చెందిన కార్మికులు కొత్త రోడ్డు వల్ల కార్మికులు ప్రమాదాలకు గుర్రై మరణిస్తున్నారని, పాత రోడ్డును పునఃరుద్ధరించాలని ఆందోళన చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన ఆరోపించారు. యాజమాన్యానికి ఉత్పత్తి మీద ఉన్న శ్రద్ధ, కార్మికుల ప్రాణాలపై లేదని ఆరోపించారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి పాత రోడ్డు ను పునఃరుద్ధరించాలని లేదా వేరే రోడ్డును ప్రత్యేకంగా వేయాలని ఆయన డిమాండ్ చేశారు. నిరసనలో ఏఐటీయూసీ నాయకులు మడ్డి ఎల్లాగౌడ్, కే.స్వామి, ఆరెల్లి పోషం, రంగు శ్రీనివాస్, గండి ప్రసాద్, సిద్ధమల్ల రాజు, జక్కుల శ్రీనివాస్, పొన్నమ్ రంజిత్, ఆరెల్లి రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు వేతనంతో కూడిన సెలవు మంజూరు

ఉమ్మడి కరీంనగర్ జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ శామ్యూల్ జాన్

నవతెలంగాణ- పెద్దపల్లి

ఈనెల 30న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ప్రతి వాణిజ్య సంస్థ, దుకాణం, వ్యాపార సంస్థలలో పనిచేసే కార్మికులకు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ శామ్యూల్ జాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపెల్లి జిల్లాలోని దుకాణ, వాణిజ్యసంస్థల యజ మానులకు, వ్యాపార సంస్థల యజమానులు గురువారం తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న సాధారణ ఎన్నికల సందర్భంగా తమ దుకాణ, వ్యాపార, వాణిజ్య సంస్థల్లో పని చేయుచున్న కార్మికులకు తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకొనే విధంగా వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని తెలిపారు. తెలంగాణ షాప్ అండ్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ 1988 చట్ట ప్రకారం యజమానులు తప్పనిసరిగా మూసివేసి కార్మికులకు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని, లేనిచో చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు.

ఎన్నికల నిబంధనలు వారిపై కేసు

నవతెలంగాణ-రాయికల్

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం పట్టణంలోని తాత్కాలిక బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వెనుక భాగంలో ఓటర్లకు భోజనాలు ఏర్పాటు చేసిన ఇద్దరు వ్యక్తులపై ఫ్లైయింగ్ స్క్వాడ్ సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎన్నికల నియమావళి 171ఇ, ఐపీసీ188 సెక్షన్ల క్రింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై అజయ్ తెలిపారు.

పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది


పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది

నవతెలంగాణ-రాయికల్

మండలంలోని 31 గ్రామాల పరిధిలో గల 48 పోలింగ్ కేంద్రాలు, పట్టణంలోని 12 పోలింగ్ కేంద్రాల్లో 24,312 మంది పురుషులు, 26,970 మంది మహిళలు థర్డ్ జెండర్ ఇద్దరు మొత్తం 51,284 మంది ఓటర్లు ఉన్నారు. వారు నేడు ఉదయం 7 గంటల నుంచి ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. బుధవారం సాయంత్రం ఎన్నికల నిర్వహణ సిబ్బంది పోలింగ్ బూత్‌లకు చేరుకున్నారు.

పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

- రామగుండం నియోజకవర్గాల పరిధిలో 260 పోలింగ్ కేంద్రాలు
- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎన్నికల సాధారణ పరిశీలకులు

నవతెలంగాణ-గోదావరిఖని

జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌ను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం రామగుండం అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేష్ సింగ్ రానాలతో కలిసి రామగుండంలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలలో పోలింగ్ సిబ్బందికి పోలింగ్ సామాగ్రి పంపిణీ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన ఈవీఎం యంత్రాలను సదరు పోలింగ్ కేంద్రాల సిబ్బందికి అప్పజెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేష్ సింగ్ రాణా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, రామగుండం రిటర్నింగ్ అధికారి జే.అరుణశ్రీ,ఏఆర్ఓ కుమారస్వామి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ విజయ్, మీడియా అండ్ కమ్యూనికేషన్ ప్లాన్ నోడల్ అధికారి రజిని, డీసీపీ చేతన, ఏసీపీ తుల శ్రీనివాసరావు, సిఐలు, ఎస్ఐలు సంభందిత అధికారులు,పాల్గొన్నారు.

డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల తనిఖీ

నవతెలంగాణ-జగిత్యాలటౌన్:

శాసన సభ ఎన్నికలు సందర్భంగా కోరుట్లలోని ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను జగిత్యాల ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా 94 రూటు మొబైల్స్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఎన్నికల అబ్జర్వర్ రాజీవ్ రంజన్ మీనాతో మాట్లాడి ఎన్నికల సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ గురించి తీసుకుంటున్న చర్యల గురించి ఆరా తీశారు.

పోలింగ్ నిర్వహణకు సర్వం సిద్ధం

- కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం పర్యవేక్షణ
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి

నవతెలంగాణ - కరీంనగర్

జిల్లాలో పోలింగ్ నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. బుధవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జిల్లాలోని 4 నియోజకవర్గాలు కరీంనగర్, చొప్పదండి, మానకొండూరు, హుజురాబాద్‌ల్లో ఎన్నికల నిర్వహణకు సంబంధించి డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో 4 నియోజకవర్గాలలో జరుగే అసెంబ్లీ సాధారణ ఎన్నికల నిర్వహణ పై తీసుకోవలసిన చర్యలు, జాగ్రత్తలపై సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చారు. ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలు, ఓటింగ్ ప్రక్రియ సజావుగా సాగడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు.పంపిణీ కేంద్రాల ద్వారా ఎన్నికల సామాగ్రి పంపిణీ చేయడం జరుగుతుందని, ఎన్నికల విధులలో పాల్గొనే సిబ్బంది అధికారులకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ప్రతిక్షణం అధికారులకు దిశా నిర్దేశం చేస్తూ పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్, చొప్పదండి, మానకొండూర్, హుజూరాబాద్ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు మహేశ్వర్, ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీ కిరణ్, రాజుఎన్నికల విభాగం సిబ్బంది తదితరులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద వికలాంగులకు సేవలందించాలి

పోలింగ్ కేంద్రానికి ఓటు వేయడానికి వచ్చే వికలాంగులు, వృద్ధులకు అవసరమైన సేవలను అందించాలని జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో దివ్యాంగులు, వయోవృద్ధులకు పోలింగ్ రోజున కల్పించాల్సిన సేవలపై జిల్లా ఎన్నికల అధికారి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోలింగ్ రోజు తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి పోలింగ్ కేంద్రాలకు వచ్చే వికలాంగులు, వయోవృద్ధుల కోసం ప్రతి పోలింగ్ కేంద్రంలో ఒక ఎన్ఎస్ఎస్ వాలంటరీలను సహాయకులుగా ఏర్పాటు చేసినట్టు చెప్పారు. 743 వాలంటీర్లు, అందులో 488 ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, 247 అంగన్‌వాడీ ఆయాలను 651 పోలింగ్ లోకేషన్లలో వీరి సేవలను అందిస్తారని తెలిపారు. దివ్యాంగులకు, వృద్ధుల కోసం ఉచిత రవాణా సదుపాయాన్ని కల్పించడం జరుగుతుందన్నారు. బిఎల్ఓలు, ఎన్ఎస్ఎస్ వాలంటరీలకు సహకరించాలని తెలిపారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు టీ షర్ట్ అందించి. వాలంటీర్లుగా సేవలను అందించడానికి వచ్చిన వారిని జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డిడబ్ల్యుఓ సరస్వతి, అడిషనల్ డీఆర్డీఓ సంధ్యారాణి, ఎగ్జిక్యూటివ్ అధికారి రాజేశ్వరి, సిడిపిఓలు అరవింద, ఉమారాణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి పూజ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి




పోలీసు సిబ్బందితో మాట్లాడుతున్న కరీంనగర్ సీపీ

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలన సీపీ

నవతెలంగాణ - కరీంనగర్ క్రైమ్

ఎన్నికల వేళ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలగకుండా తీసుకునే ముందస్తు భద్రత చర్యల్లో భాగంగా బుధవారం కరీంనగర్ కమిషనరేట్ లోని పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి స్వయంగా పరిశీలించారు. దీనిలో భాగంగా హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో గల వీణవంక మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చల్లూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నర్సింగాపూర్ లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జమ్మికుంట లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, ఇల్లందకుంట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, చెల్పూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను స్వయంగా పరిశీలించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద స్థానిక పోలీసులతో పాటు కేంద్ర సాయుధ బలగాలను, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ లను విధులకు కేటాయించమన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఉన్న సిబ్బందికి నిర్వహించవలసిన విధుల పట్ల పలు సూచనలు చేశారు. గతంలో జరిగిన సంఘటనల ఆధారంగా స్థానిక ప్రిసైడింగ్ అధికారులకు, పై పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారని తెలిపారు. పోలింగ్ రోజున ఏదైనా శాంతి భద్రతల సమస్యలు తలెత్తితే వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు తెలియజేయాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా సహకరించి విధులు నిర్వర్తించాలన్నారు.

ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన బందోబస్తు

నవతెలంగాణ-జైపూర్ :ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసేందుకు పోలీస్ శాఖ పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసింది. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో గల పోలీస్ అధికారులతో పాటు కేంద్ర బలగాలతో ఏర్పాటు చేస్తున్నారు. పోలీస్ రూట్ మొబైల్ అధికారులు, ఆర్మ్డ్ అధికారులతో పోలింగ్ అధికారులను, పోలింగ్ పరికరాలను పోలింగ్ లొకేషన్‌కు పటిష్టమైన భద్రతతో తరలిస్తున్నట్లు రామగుండం సీపీ రెమో రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల జిల్లా పరిధిలో 1762 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది, 10 కేంద్ర బలగాల కంపెనీలు 650 మంది చత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన హోంగార్డ్స్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఒక పోలీస్ టీమ్‌ను పోలింగ్ బందోబస్త్‌కు వినియోగిస్తున్నారు. ఎన్నికల నిర్వాహణకు మానిటరింగ్ చేసేందుకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు సీపీ తెలిపారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలో 48 గంటల పాటు సైలెన్స్ పిరియడ్‌లో అన్ని లాడ్జీలు, ఫక్షన్‌హాల్స్, గెస్ట్ హౌస్‌లు తనిఖీ చేస్తున్నామన్నారు. ఆకస్మిక తనిఖీలు, ఓటర్లను ప్రభావితం చేయడం, ప్రజలను ప్రలోభాలకు గురి చేసే డబ్బులు, వస్తువులు పంచకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. చెన్నూర్ నియోజకవర్గంలో పూర్తి స్థాయిలో నవంబర్ 30 సాయంత్రం 5 గంటల వరకు 144 సెక్షన్ అమలు చేయడం జరుగుతుందని అధికారులు తెలిపారు. కాగా ఎన్నికల నిర్వాహణలో భాగంగా మంచిర్యాల జిల్లా పరిధిలో 1989 మందిని బైండోవర్ చేసిన అధికారులు మావోయిస్టు ప్రభావిత ప్రాంతం పోలింగ్ లొకేషన్లలో ప్రత్యేక భద్రత ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. సరిహద్దు రాష్ట్రాలు ప్రాణహిత పరివాహక ప్రాంతాల్లో డ్రోన్ పెట్రోలింగ్ యూనిట్లు ఏర్పాటు చేసే ప్రత్యేక నిరంతర నిఘా ఏర్పాటు చేశారు. ఎన్నికల నియమావళి నిబంధనలు ఉల్లంఘించిన ఎన్నికల ప్రక్రియకు భంగం కలిగించినా, అల్లర్లు, గొడవలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా సీపీ హెచ్చరించారు.



మద్యం, చీరలను పట్టుకున్న ఫ్లయింగ్ స్క్వాడ్



నవతెలంగాణ-నస్పూర్

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అక్రమంగా నిలువ ఉంచిన మద్యం, చీరలను ఫ్లయింగ్ స్క్వాడ్ టీం బుధవారం పట్టుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియాలోని ఒకరి ఇంటి వద్ద 15, మరొకరిది వద్ద 41 క్వార్టర్ సీసాలను, అలాగే ఒకరింటి వద్ద 110 చీరలు, సీసీసీ కార్నర్ ఎస్బీఐ బ్యాంకు ఎదుట బైకులపై తరలిస్తున్న 197 చీరలను పట్టుకున్నట్టు తెలిపారు. వీటన్నింటినీ సీజ్ చేసి వారిపై తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



భారీ మొత్తంలో నగదు పట్టివేత

నవతెలంగాణ - సిర్పూర్(టి)

పోలీస్‌స్టేషన్ ఎదుట వాహనాలు తనిఖీ చేస్తుండగా రూ.56.48లక్షలు పట్టుకున్నట్టు ఫ్లయింగ్‌స్క్వాడ్ ఫీల్డ్ ఆఫీసర్ రఘునాథరావు, దీకొండ రమేష్ తెలిపారు. వారి వివరాల ప్రకారం..సిర్పూర్ నుండి కాగజ్‌నగర్‌కు ఆటోలో డ్రైవర్ షఫిల్లాఖాన్ నగదు తరలిస్తున్నాడనే సమాచారం మేరకు పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుకున్నారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా సిర్పూర్ గ్రామానికి చెందిన తంగడిపెల్లి సంతోష్, ముసవీర్ తన ఆటోలో సన్‌ఫ్లవర్ నూనె డబ్బాలు వెనుక భాగంలో నగదు ఉంచారని తెలిపాడు. డబ్బాలను సిర్పూర్‌లో తీసుకుంటామని తెలపడంతో తీసుకొచ్చినట్టు తెలిపాడు. ఇద్దరిని పిలిపించి విచారించగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నామని తెలిపారు. పట్టుబడిన నగదును సీజ్ చేసి తదుపరి విచారణ చేపడుతున్నామని పోలీసులు పేర్కొన్నారు.



తెలంగాణ వ్యతిరేకులతో కేసీఆర్ పాలన

- తిరిగి కాంగ్రెస్ గూటికి చేరడం సొంతింటికి వచ్చినట్టుంది
- బీఆర్ఎస్, బీజేపి రెండు ఒక్కటే
- కాంగ్రెస్ నాయకుడు గజ్జెల కాంతం

నవతెలంగాణ - కరీంనగర్

కాంగ్రెస్ అధినేత సోనియాగాంధీ ఇచ్చిన తెలంగాణలో తెలంగాణ వ్యతిరేకులతో తెలంగాణను కేసీఆర్ పాలిస్తున్నారని కాంగ్రెస్ నాయకుడు గజ్జెల కాంతం అన్నారు. బుధవారం నగరంలోని డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ తిరిగి ఆహ్వానించడం సొంతింటికి చేరుకున్నట్టుందన్నారు. పార్టీలోకి ఆహ్వానించిన అధినాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ప్రజల అకాంక్షల మేరకు సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించిన వారిని సీఎం కేసీఆర్ తన పక్కన కూర్చొబెట్టుకున్నారని విమర్శించారు. గంగుల కమలాకర్, పాడికౌశిక్‌రెడ్డితో పాటు చాలామంది తెలంగాణ వ్యతిరేకులే అని ఆరోపించారు. బీఆర్ఎస్, బీజేపీ రెండు ఒక్కటేనని చీకిటి ఒప్పందం చేసుకోన్నాయిని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ దోపిడికి గురైందన్నారు. మోడీ అధికారంలోకి వచ్చాక తెలంగాణపై ఉన్న అక్కసును వెల్లగక్కారని తెలిపారు. తెలంగాణ మీద మోడీకి ఎలాంటి ప్రేమ లేదన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసినా ప్రజా స్పందనను ఆపలేరని.. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. బీఆర్ఎస్ ,బీజేపి ఒక్కటవ్వడంతోనే తాను కాంగ్రెస్ సొంతగూటికి చేరుకున్నట్లు తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సముద్రాల లక్ష్మణ్, బోనాల సంపత్‌కుమార్, మీసాల సాయిలు, అవారు లత, మాతంగి సంతీస్, తప్పట్ల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సర్వం సిద్ధం



సిద్ధమైన మోడల్ పోలింగ్ స్టేషన్

నవతెలంగాణ - తిమ్మాపూర్

తిమ్మాపూర్ మండలం వ్యాప్తంగా ఎన్నికలకు సర్వం సిద్ధమయ్యింది. బుధవారం సాయంత్రం ఎన్నికల సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు పోలీసుల బందోబస్తుతో చేరుకున్నారు. రామకృష్ణ కాలనీ గ్రామంలో మహిళలకు, పోరండ్లలో వికలాంగులకు ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అలాగే పర్లపల్లిలో మోడల్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎన్నికలు సక్రమంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు పోలీస్ సిబ్బంది పెద్ద మొత్తంలో గ్రామాలకు చేరుకున్నారు. మండలంలోని 23 గ్రామాలకు 57 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మొత్తం ఓటర్లు 41,388 ఉండగా.. పురుషులు 20,161, మహిళలు 21,227 మంది ఉన్నారు.

కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా రాజేందర్



రాజేందర్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న మేడిపల్లి సత్యం

నవతెలంగాణ - చొప్పదండి

కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలంలోని గుమ్లాపూర్ గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు మునిగాల రాజేందర్‌ను జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పులి ఆంజనేయులుగౌడ్ నియమించారు. నియామకపత్రాన్ని రాజేందర్‌కు చొప్పదండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మేడిపల్లి సత్యం అందజేశారు. రాజేందర్ మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ బీసీ నాయకత్వాన్ని బలోపేతం చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన హుస్నాబాద్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి పొన్నం ప్రభాకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మానకొండూర్ అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి అభ్యర్థి మేడిపల్లి సత్యం, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు పులి ఆంజనేయులు గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

డిస్ట్రిబ్యూషన్ సెంటర్ పరిశీలించిన సీపీ

ఎన్నికల విధుల సిబ్బందికి విధులపై అవగాహన



: మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్

నవతెలంగాణ - కరీంనగర్ క్రైం

హుజురాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్నికల విధుల కోసం కేటాయించబడిన సిబ్బందితో నిర్వహించాల్సిన విధుల గురించి కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. ఎన్నికల విధుల పట్ల చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల ప్రక్రియలో పోలింగ్ రోజు చాలా కీలకమన్నారు. సిబ్బందికి కేటాయించిన విధులను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలన్నారు. పోలింగ్ ప్రారంభమయ్యే సమయం కంటే ఒక గంట ముందుగానే విధులకు సిద్ధంగా ఉండాలన్నారు. పోలింగ్ బూత్ వద్ద ఇతర శాఖల సిబ్బందితో సమన్వయంగా విధులు నిర్వర్తించాలన్నారు. పోలింగ్ బూత్ వద్ద విధుల్లో ఉండే సిబ్బంది సంబంధిత రూట్ ఆఫీసర్, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ అధికారుల యొక్క ఫోన్ నెంబర్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించే ఏదైనా సమస్య ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని, గుర్తించిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారాన్ని అందించాలన్నారు. స్థానిక ప్రజలు, ఓటర్లతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని అన్నారు. పోలీసు సిబ్బంది ప్రవర్తనతో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. పోలింగ్ బూత్ లోకి అనుమతి లేని పరికరాలు, వస్తువులను ఓటర్లు పోలింగ్ బూత్ లోనికి తీసుకెళ్లకుండా చూడాలన్నారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగే విధంగా విధులు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి

నవతెలంగాణ-కరీంనగర్ క్రైం

ఎన్నికల వేళ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలగకుండా తీసుకునే ముందస్తు భద్రత చర్యల్లో భాగంగా బుధవారం కరీంనగర్ కమిషనరేట్‌లోని పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి స్వయంగా పరిశీలించారు. దీనిలో భాగంగా మానకొండూర్ మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను స్వయంగా పరిశీలించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద స్థానిక పోలీసులతో పాటు కేంద్ర సాయుధ బలగాలను విధులకై కేటాయించమన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఉన్న సిబ్బందికి నిర్వహించాల్సిన విధుల పట్ల పలు సూచనలు చేశారు. గతంలో జరిగిన సంఘటనల ఆధారంగా స్థానిక ప్రిసైడింగ్ అధికారులకు, పై పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారని తెలిపారు. పోలింగ్ రోజున ఏదైనా శాంతి భద్రతల సమస్యలు తలెత్తితే వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు తెలియజేయాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా సహకరించి విధులు నిర్వర్తించాలని తెలిపారు.

పోలింగ్ కేంద్రాలు సిద్ధం



నవతెలంగాణ - గన్నేరువరం

మండల వ్యాప్తంగా 29 పోలింగ్ కేంద్రాలలో అన్ని సౌకర్యాలతో కూడిన ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ప్రత్యేక పోలింగ్ అధికారి కిరణ్మయి తెలిపారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద బిఎల్వోలు ఓటు హక్కు, సిరా చుక్క, మహిళల చిత్రాలను ముగ్గులతో ప్రదర్శించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ పోలింగ్ అధికారులకు, ఓటర్లకు, వృద్ధులు, వికలాంగులకు అన్ని సౌకర్యాలను కల్పించామన్నారు. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, బిఎల్వోలు, ఓడి, వివోలు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పరిశీలించిన మున్సిపల్ కమిషనర్



నవతెలంగాణ - చొప్పదండి

తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో గురువారం నిర్వహించే ఓటింగ్‌లో భాగంగా చొప్పదండి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో, గాంధీనగర్ తదితర పోలింగ్ బూత్ కేంద్రాలలో ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ పి.శాంతి కుమార్ పరిశీలించారు. ఓటు వేయడానికి వచ్చే వారికి తాగునీరు, వికలాంగులకు వీల్ చైర్స్, మరుగుదొడ్లు, ఫ్యాన్లు, విద్యుత్ లైట్స్, అత్యవసర వైద్య సేవల నిమిత్తం అంబులెన్స్ సౌకర్యాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం పట్టివేత.. ఇద్దరిపై కేసు



నవతెలంగాణ - హుజురాబాద్

హుజురాబాద్ పట్టణంలోని కుమ్మరివాడలో బుధవారం ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు నిర్వహించగా నిబంధనల విరుద్ధంగా అక్రమంగా మద్యం లభించడంతో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు హుజురాబాద్ ఎక్సైజ్ సీఐ దుర్గాభవాని తెలిపారు. ఎన్నికల తనిఖీల్లో భాగంగా కుమ్మరివాడలో మోతే రవి, నారాయణ అనే వ్యక్తుల వద్ద 6000 విలువగల మందు బీర్లు లభించాయని. వాటిని సీజ్‌చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు.

మోడల్ కోడ్‌ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



నవతెలంగాణ - గన్నేరువరం

మోడల్ కోడ్‌ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై చందా నరసింహారావు అన్నారు. మండలంలో 144 సెక్షన్ అమల్లో ఉందని, గుంపులు గుంపులుగా ఉండొద్దని సూచించారు. రాజకీయ నాయకులు ఓటర్లకు మద్యం, డబ్బులు పంపిణీ చేస్తే సమాచారం ఇవ్వాలన్నారు. ఓటర్లను బెదిరించినా, భయభ్రాంతులకు గురి చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. అల్లర్లు, గొడవలు సృష్టిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

హుజురాబాద్‌లో ఏర్పాట్లు పూర్తి



డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి ఎన్నికల సామగ్రితో వెళ్తున్న ఉద్యోగులు, సిబ్బంది

నవతెలంగాణ - హుజురాబాద్

హుజురాబాద్ శాసనసభ నియోజకవర్గానికి గురువారం జరగనున్న సాధారణ ఎన్నికల కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏర్పాట్లను కలెక్టర్ పమేల సత్పతి, డీఈవో జనార్దన్‌రావు పరిశీలించారు. ఆర్వో ఎస్.రాజు ఆధ్వర్యంలో పర్యవేక్షించారు. హుజురాబాద్ శాసనసభ నియోజకవర్గంలో మొత్తం 305 పోలింగ్ కేంద్రాలు ఉండగా వాటి నిర్వహణ గాను 305 ప్రిసైడింగ్ ఆఫీసర్లు, 305 సహాయ ప్రిసైడింగ్ అధికారులు 610 పోలింగ్ సిబ్బందిని వీరికి సహాయకంగా ఒక పోలీసును నియమించారు. మొత్తం 1310 మంది సిబ్బందిని నియోజకవర్గంలో విధులు నిర్వహించడానికి కేటాయించగా కొన్ని కేంద్రాల్లో 1200 ఓట్ల కన్నా ఎక్కువ ఉన్న ప్రాంతంలో మరో 30 మంది పోలింగ్ సిబ్బందిని నియమించారు. 30మంది సెక్టార్ ఆఫీసర్లు, 30మంది రూట్ ఆఫీసర్లు ఏర్పాటు చేసి ఎన్నికలు సాఫీగా జరగడానికి రిటర్నింగ్ అధికారి చర్యలు తీసుకున్నారు. వీరికి తోడు పోలీస్ సిబ్బంది, సాయుధ బలగాలు సుమారు 650 మందికి విధులు కేటాయించారు. నియోజకవర్గంలోని హుజురాబాద్, జమ్మికుంట, కమలాపూర్, వీణవంక, ఇల్లందకుంట మండలాల్లో 82 సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించారు. సిబ్బంది కోసం సుమారు 100 బస్సులు, జీబులు కార్లను ఏర్పాటు చేశారు. ఒక్కొక్క రూటుకు ఒక బస్సు చొప్పున ఏర్పాటు చేసి వారిని పోలింగ్ కేంద్రాలకు తరలించారు.



అధికారులకు సూచనలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్

గురువారం పోలింగ్ జరిగే సమయానికి ముందు పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించాలని సూచించారు. నిర్వహణ సమయంలో ఎలాంటి అంతరాయాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినప్పటికీ అనుకోని సమస్యలు ఎదురైనప్పుడు తప్పనిసరిగా సెక్టార్ ఆఫీసర్ల దృష్టికి తీసుకొని రావాలని సూచించారు. వీరికి తోడు మాడల్ కోడ్ ఆఫీసర్లు, నోడల్ ఆఫీసర్లు ఎప్పుడు పర్యవేక్షిస్తుంటారని తెలిపారు. హుజురాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి బుధవారం మధ్యాహ్నం నుండి పోలింగ్ సిబ్బంది తమకు ఇచ్చిన పోలింగ్ మెటీరియల్‌తో పోలీసులతో కలిసి వారి కేటాయించిన రూట్ బస్సుల్లో గ్రామాలకు తరలి వెళ్లారు.

కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల నటనను చూసి మోసపోవద్దు

చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్



మాట్లాడుతున్న సుంకె రవిశంకర్

నవతెలంగాణ - గంగాధర

కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల నటనను చూసి ప్రజలు మోసపోవద్దని చొప్పదండి ఎమ్మెల్యే బీఆర్ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్ కోరారు. గంగాధర మండలం మధురానగర్‌లో బుధవారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. స్థానిక బిడ్డనైన తనను ఆశీర్వదించి మరోసారి ఎమ్మెల్యేగా అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నానని, గతంలో ఎమ్మెల్యేలుగా గెలిచిన స్థానికేతరులు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేకపోయారని అన్నారు. ఎన్నికల ముందు వచ్చి తర్వాత వెళ్లిపోయే నాయకులకు ఈ ప్రాంతం మీద మమకారం ఉండదని అన్నారు. పార్టీలకు అతీతంగా తాను అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందజేస్తున్నానని, ఈ విషయం ప్రజలు గ్రహించాలని కోరారు. అందరికి అందుబాటులో ఉంటున్న.. ఏ ఆపద వచ్చినా తాను అండగా నిలుస్తానని అన్నారు. 60 ఏండ్లు పరిపాలించిన కాంగ్రెస్ పార్టీ ఏమీ చేయలేదని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కళ్యాణలక్ష్మీ, 24 గంటల కరెంటు, రైతుబంధు, రైతు బీమా, ఆసరా పెన్షన్లు అమలు చేయడం లేదన్నారు. దీనిపై కాంగ్రెస్, బీజేపీ నాయకులు సమాధానం చెప్పాలన్నారు. ఈ సమావేశంలో సింగిల్‌విండో ఛైర్మన్లు వెలిచాల తిర్మల్‌రావు, దూలం బాలగౌడ్, మాజీ జెడ్పీటీసీ గునుకొండ బాబు, బీఆర్ఎస్ నాయకులు, సర్పంచులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ నుంచి సరికొత్త పాలసీ 'జీవన్ ఉత్సవ్'



పాలసీని ప్రారంభిస్తున్న డివిజనల్ మేనేజర్

నవతెలంగాణ - కరీంనగర్

లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సరికొత్త సంచలన పాలసీ జీవన్ ఉత్సవ్‌ని ప్రారంభించింది. కరీంనగర్ డివిజనల్ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ మేనేజర్ ఎస్వీ ప్రసాదరావు పాలసీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అన్ని వర్గాల, అన్ని వయసుల పాలసీదారుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఎల్ఐసీ ఈ పాలసీని రూపొందించిందన్నారు. ఈ పాలసీ ప్రవేశంతో భారతీయ బీమా రంగంలో సంచలనం నమోదు కానుందని విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. తక్కువ కాలం ప్రీమియం చెల్లించి జీవితాంతం ఆర్థిక ప్రయోజనాలు పొందే అద్భుతమైన పాలసీయని, ప్రతి 1000 రూపాయలకి 40 రూపాయల గ్యారెంటీ అడిషన్స్‌తో కచ్చితమైన ఆదాయాన్ని జీవితాంతం ఇవ్వగలిగిన ఏకైక పాలసీ భారతీయ బీమా రంగంలో మరొకటి లేదని తెలిపారు. కనిష్ట బీమా మొత్తం రూ.5లక్షలుగా ఉన్న ఈ పాలసీని మూడు నెలల పసికందు నుంచి మొదలుకొని 65 సంవత్సరాల వయస్సు వరకు తీసుకోవచ్చని, ప్రీమియం మాత్రం 5 నుంచి గరిష్ఠంగా 16 సంవత్సరాలు మాత్రమే చెల్లించవలసి ఉంటుందని తెలిపారు. ప్రీమియం చెల్లించిన తర్వాత సర్వైవల్ బెనిఫిట్స్ కింద ఆదాయ ప్రయోజనం ప్రతి సంవత్సరం బీమా మొత్తంలో 10 శాతం పాలసీదారుడు జీవించి ఉన్నంత కాలం చెల్లించబడుతుందని, ఇలాంటి ప్రయోజనం ఇంతవరకు లేదని తెలిపారు. ఉదాహరణకు ఒక 25 సంవత్సరాల వ్యక్తి 12 సంవత్సరాల కాలంలో కేవలం 10 లక్షలు ప్రీమియం చెల్లించి తనకు 38 సంవత్సరాల వయసు నుంచి ప్రతి సంవత్సరం ఒక లక్ష చొప్పున అతను జీవించి ఉన్నంత కాలం లాభాన్ని స్వీకరించవచ్చు అని వివరించారు. ప్రతి సంవత్సరం ఈ లక్ష రూపాయల మొత్తాన్ని తీసుకోకుండా వాయిదా వేస్తే దాని మీద 5.5 శాతం చక్రవడ్డీతో కలిపి 100 సంవత్సరాల చివరి నాటికి సుమారు 2 కోట్ల 60 లక్షల సొమ్ము చెల్లించబడుతుందంటే ఈ పాలసీలో ఉన్న ఆర్థిక ప్రయోజనం ఎంత అద్భుతంగా ఉందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. వడ్డీతో కలిపి జమ అయిన మొత్తంలో గరిష్ఠంగా 75 శాతం తీసుకొనవచ్చును అని, ఆరోజు నుంచి మిగిలిన మొత్తంపై 5.5 శాతం చక్రవడ్డీ కొనసాగుతుందని తెలిపారు. యాక్సిడెంట్ బెనిఫిట్ సౌకర్యం ఉందని తెలిపారు. పాలసీ కాల పరిమితిలో లోన్ సౌకర్యం కలదని, పాలసీ కాలపరిమితి తర్వాత అనగా రెగ్యులర్ ఆదాయం మొదలైన తర్వాత కూడా లోన్ సదుపాయం కలదని తెలిపారు. ఇతర వివరాలకు సమీప ఎల్ఐసీ కార్యాలయాన్ని కానీ ఏజెంట్‌ను కానీ వికాసాధికారిని కానీ సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ ఎంఆర్కె శ్రీనివాస్, సేల్స్ మేనేజర్ రాజేష్ ఖన్నా, వికాసాధికారుల సంఘం నాయకులు వాసుదేవ రెడ్డి, ఏజెంట్ల లియాఫి సంఘం నాయకులు రంగారావు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నాలుగోసారి విజయం సాధించబోతున్నా..

మంత్రి గంగుల కమలాకర్



మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

నవతెలంగాణ - కరీంనగర్

మంచి మెజార్టీతో నాలుగోసారి విజయం సాధించబోతున్నాను అని కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. దక్షిణ భారత దేశంలోనే తొలిసారిగా తమ పార్టీ మూడోసారి ప్రభుత్వం ఏర్పాటు చేయబోతుందని ధీమా వ్యక్తం చేశారు. బుధవారం కరీంనగర్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. కరీంనగర్‌లో బండి సంజయ్ అకృత్యాలతో ప్రజలు విసిగి వేసారి పోయారని అన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్ అని బండి సంజయ్‌ని ఎంపీగా గెలిపిస్తే కరీంనగర్‌కి నిరాశే మిగిలిందన్నారు. ధర్మం కోసం అని దేవుడి పేరు చెప్పే బండి సంజయ్ ఒక్క గుడికి పైసా ఇవ్వలేదు.. తాము వెంకటేశ్వరస్వామి గుడి, ఇస్కాన్ టెంపుల్ కడుతుంటే బండి సాయం ఏది అని ప్రశ్నించారు. ఎంపీగా బండి సంజయ్ ఘోరంగా విఫలం అయ్యారు.. అందుకే మూడోసారి ఓడిపోతున్నారని అన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను ఉల్లంఘించి బీజేపీ వాళ్లు డబ్బులు, మద్యం పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. బండి సంజయ్ కొత్తపల్లిలో చాలా దారుణంగా వ్యవహరించాడని, పార్లమెంటు సభ్యుడి స్థాయిలో హుందాగా ఉండాల్సిన వారు అలా చేయడం ఏంటని ప్రశ్నించారు. బండి సంజయ్ డబ్బులు, మద్యం పంపిణీ చేయలేదని భాగ్యలక్ష్మి టెంపుల్‌లో ప్రమాణం చేస్తారా అని అన్నారు. కొత్తపల్లిలో డబ్బులు పంపిణీ చేస్తుంటే మా వాళ్లు పట్టుకున్నారు, డబ్బులు పంచుతూ బండి సంజయ్ అడ్డంగా దొరికిపోయి అడ్డుకున్న మా కార్యకర్తలు డబ్బులు పంచుతున్నారని గొడవ చేశారు. బండి సంజయ్ డబ్బులు పంచారని సీసీ పుటేజీలో చాలా క్లియర్‌గా కనిపించిందన్నారు. ఇంట్లో ఉన్న మా కార్యకర్తపై స్వయంగా దాడులు చేసాడని ఆరోపించారు. తాము డబ్బులు పంచుతున్నామని ఆరోపిస్తున్న సంజయ్ మొదట పోలీసులకు ఎందుకు ఫిర్యాదు చేయలేదని అన్నారు. ఒక ఎంపీవి.. గూండాలను తీసుకుపోయి దాడులు చేస్తావా.. ఇంట్లో ఉన్న కార్యకర్తను కొట్టి బూతులు తిడతావా ఇదేనా దేశం కోసం, ధర్మం కోసం అంటే అని అన్నారు. ఆయన చూపెట్టిన ఓటర్ లిస్ట్ వారి కార్‌లోనే దొరికింది, మా మీద బురద చల్లుతున్నాడు అన్నారు. 'చట్టాన్ని చేతిలోకి తీసుకుని దాడులు చేస్తున్న నువ్వు ఎమ్మెల్యే అయితే కరీంనగర్ బతకదు అని ప్రజలే అనుకుంటున్నారు' అని అన్నారు. లక్ష సెల్ ఫోన్లు అని ప్రచారం చేసిన సంజయ్ అవి ఎక్కడ ఉన్నాయి.. నిజంగా తాము పంచినట్లయితే ఒక్కటైనా చూపించాలిగా అని ప్రశ్నించారు. సీఎంఓ నుంచి అధికారులు వచ్చి డబ్బులు ఎందుకు పంచుతారు.. మళ్లీ నీ బూటకపు మాటలు నమ్మే స్థితిలో కరీంనగర్ ప్రజలు లేరు అని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో పోలింగ్‌కు సహకరించాలి

కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి



నవతెలంగాణ - వీణవంక

ప్రశాంతత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తాము కృషి చేస్తున్నామని.. ఇందుకు ప్రజలు సహకరించాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి కోరారు. మండలంలోని వీణవంక మోడల్ పోలింగ్ స్టేషను ఆయన బుధవారం సాయంత్రం సందర్శించారు. పోలింగ్ స్టేషన్లో ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులను వివరాలు అడిగి తెలుసుకుని మండలంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ఆయన వెంట హుజురాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి, జమ్మికుంట రూరల్ సీఐ కిషోర్, బిఎస్ఎఫ్ జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.